www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

గురువారం
02-02-2023
సంపుటి - 07,
సంచిక-248
పేజీలు - 4
వెల రూ. 5/-

ఎడిటర్ : పృధ్విరాజ్. జి
9581442622

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఇందిరా దారెటు!



2వ పేజీలో...



# సాదాసీదాగా బడ్జెట్

## ఆదాయ పన్ను పరిమితి పెంపు రూ.7లక్షలు ● వడ్డీలేని రుణాల పథకం కోసం రూ.13.7 లక్షల కోట్లు కేటాయింపు

- ఆదాయం రూ.7లక్షలు దాటితే 5 స్లాబుల్లో పన్ను
- రూ.7 నుంచి 9 లక్షల వరకు 5శాతం పన్ను
- ఆదాయం రూ.30లక్షలు దాటితే 30శాతం పన్ను
- భారీగా పెరగనున్న టైర్లు, సిగరెట్ల ధరలు
- వజ్రాలు, బంగారం, వెండి ధరలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు
- పెరగనున్న బ్రాండెడ్ దుస్తుల ధరలు
- విదేశాల నుంచి దిగుమతి అయ్యే రబ్బరు ధర పెంపు
- భారీగా తగ్గనున్న టీవీలు, మొబైళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలు
- టీవీ ప్యానెళ్లపై కస్టమ్స్ డ్యూటీ 2.5శాతం తగ్గింపు
- లిథియం బ్యాటీరీలపై 21 నుంచి 13శాతానికి కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు
- సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ లిమిట్ రూ.15 నుంచి 30లక్షలకు పెంపు
- 63వేల సొసైటీల డిజిటలైజేషన్ కోసం రూ.2,516 కోట్లు కేటాయింపు
- ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక విభాగం
- నిరుద్యోగుల కోసం పీఎం కౌశల్ పథకం
- స్వదేశీ ఉత్పత్తుల అమ్మకానికి యూనిట్ మాల్స్
- నీతి ఆయోగ్ మరో మూడేళ్లపాటు పొడిగింపు
- దేశంలో 50 టూరిస్ట్ స్పాట్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఫార్మారంగ అభివృద్ధికి ప్రత్యేక పథకం
- నేషనల్ హైడ్రోజన్ గ్రీన్ మిషన్‌కు రూ.19,700 కోట్లు కేటాయింపు
- విద్యుత్ రంగానికి రూ.35వేల కోట్లు కేటాయింపు
- దేశవ్యాప్తంగా కొత్తగా 50 ఎయిర్‌పోర్టులు, హెలిప్యాడ్‌ల నిర్మాణం
- 5జీ సేవల అభివృద్ధికి 100 ప్రత్యేక ల్యాబ్‌లు
- నేషనల్ డేటా గవర్నెన్స్ ద్వారా సులభతర కేవైసీ
- ఈ-కోర్టుల ప్రాజెక్ట్‌కు రూ.7వేల కోట్లు కేటాయింపు
- గిరిజన మిషన్ కోసం రూ.10వేల కోట్లు:
- ఏడాదికి అర్బన్ ఇన్ ఫ్రా ఫండ్ కోసం రూ.10వేల కోట్లు
- రూ.75వేల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- ఎస్టీ వర్గాలకు రూ.15 వేల కోట్లు కేటాయింపు
- రైల్వేలకు రూ.2.40 లక్షల కోట్లు కేటాయింపు
- బడ్జెట్‌లో మూలధన వ్యయానికి రూ.10లక్షల కోట్లు కేటాయింపు
- పీఎం మత్స్యసంపద యోజనకు అదనంగా రూ.6వేల కోట్లు
- గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం రూ.15వేల కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (సమ సమాజం):** ప్రధాని మోడీ చెప్పినట్లుగా ప్రపంచం యావత్తూ భారత్ బడ్జెట్ వైపు చూస్తుందన్న సూచనలు ఏవీ లేకుండా..ఎటువంటి మెరుపులు..ఊరడింపులు.. కానరాని బడ్జెట్ ఆవిష్కృతం అయ్యింది. వరాలు కానీ, మాయలు కానీ లేకుండా సాదాసీదాగానే బడ్జెట్ కేటాయింపులు చేపట్టారు. ఎన్నికల కోసం ప్రత్యేకంగగా ఎలాంటి తాయిలాలు ప్రకటించే ప్రయత్నం చేయలేదు.ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అమృత కాలంలో ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌గా పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెడుతున్న బడ్జెట్ అని పేర్కొన్నారు. ఈసారి బడ్జెట్ రూపకల్పనలో ఏడు కీలక అంశాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఆదాయపు పన్నుల్లో శ్లాబుల వంటి ఉత్సాహం కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవాలి. మొత్తంగా సాదాసీదాగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఐదోసారి తన 2023-2024 వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశ



పెట్టారు. పలురాష్ట్రాల ఎన్నికలను దృష్టి పెట్టుకుని ఉత్సాహకరంగా ఉంటుందన్న భావన లేకుండా ముందుకు సాగారు. ఆమె బడ్జెట్ ప్రసంగం గంటన్నర సేపు సాగింది. ఇకపోతే ఏడు ప్రాధాన్యతా అంశాల ఆధారంగా బడ్జెట్ 2వ పేజీలో...

# దొంగలకు దొరకని ఒకేఒక వస్తువు విద్య

- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- కెజి టూ పిజి లక్ష్యంతో పాఠశాలల అభివృద్ది
- గంభీర్‌రావు పేటలో కొత్త క్యాంపస్‌కు మంత్రుల ప్రారంభం
- విద్య,వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు కెసిఆర్ పెద్దపీట
- ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమాలు లేవన్న మంత్రి కెటిఆర్





**రాజన్నసిరిసిల్ల,ఫిబ్రవరి1(సమసమాజం):** విద్య అనేది మన నుంచి దొంగిలించలేని ఒక అపురూపమైన వస్తువు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో భారతదేశంలో ఎక్కడా లేని విధంగా విద్యకు పెద్దపీట వేశామన్నారు. కేజీ నుంచి పీజీ దాకా చక్కటి ప్రమాణాలతో బ్రహ్మాండమైన విద్యను అందిస్తున్నాం. మన పిల్లలను ప్రపంచంతో పోటీ పడే విధంగా తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.గంభీరావుపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేజీ టు పీజీ క్యాంపస్‌ను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేజీ టు పీజీ వరకు ఒకే ఆవరణలో నెలకొల్పుతామని 2004లోనే కేసీఆర్ చెప్పారు. ఆనాటి మాట కేసీఆర్ నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు స్థాపించాం అని కేటీఆర్ తెలిపారు. గురుకుల విద్యార్థులకు సంబంధించి ఒక్కొక్కరిపై రూ. లక్షా 20 వేలు ఖర్చు పెడుతున్నాం. విద్య అనేది మన నుంచి దొంగిలించలేని ఒక అపురూపమైన వస్తువు. విద్య ద్వారా సమకూరే జ్ఞానాన్ని ఎవరూ కూడా తస్కరించలేరు.అందుకే సీఎం కేసీఆర్ నాయకత్వంలో మన ఊరు- మన బడి పేరిట రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను మూడు దశల్లో అభివృద్ధి చేస్తున్నాం అని తెలిపారు. తెలంగాణ పుట్టి ఎనిమిదిన్నరేండ్లు అవుతుంది. 75 ఏండ్ల స్వతంత్య భారతదేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమాన్ని తెలంగాణలో తీసుకుపోతున్నాం. ఈ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లో వేలు పెట్టి చూపే పరిస్థితి లేదన్నారు. ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా, అభివృద్దే మా కులం, సంక్షేమమే మా మతం, జనహితమే మా అభిమతం అనే దిశగా ముందుకు పోతున్నాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.. విద్యా ప్రమాణాలకు పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతోనే మన ఊరు -మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం అని కేటీఆర్ పేర్కొన్నారు. నాయకుడికి మనసు ఉంటే ఎలాంటి పనులు జరుగుతాయనడానికి ఇలాంటి కార్యక్రమాలే నిదర్శనం. డైనింగ్ హాల్ అద్భుతంగా నిర్మించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను మనం గుర్తు చేసుకోవాలి. ఆయన పేరిట ఇప్పటికే ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అని పెట్టుకున్నాం. ఈ పాఠశాలకు ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని కేటీఆర్ సూచించారు. గంభీరావుపేటలో నిర్మించిన 3వ పేజీలో...

# దేశ అభివృద్ధికి పునాది వేసేలా బడ్జెట్ రూపకల్పన

## అన్ని వర్గాల కలలను సాకారం చేసేలా బడ్జెట్

## శ్రీ అన్న పథకం అద్భుతమని ప్రకటించిన మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (సమ సమాజం):** ఏడు అంశాలు ప్రాధాన్యంగా రూపొందించిన బడ్జెట్ కొత్త ఇండియాకు గట్టి పునాది అవుతుందని ప్రధాని మోడీ అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందించారు. 2047 లక్ష్యంగా పథకాలు రూపొందించిన ఈ బడ్జెట్ అన్ని వర్గాల కలలను సాకారం చేస్తుందని చెప్పారు. మహిళా సాధికారత కోసం నిధులు కేటాయించడంతో పాటు పీఎం విశ్వకర్మ ప్రోత్సాహకాన్ని ప్రకటించినట్లు చెప్పారు. రాష్ట్రాలకు వడ్డీలేని రుణాలు మరో ఏడాది పొడిగించామని 2వ పేజీలో...



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

## కేటాయింపులపై మంత్రి హరీష్ పెదవి విరుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి1(సమ సమాజం):** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బిఆర్ఎస్ పెదవి విరిచింది. బడ్జెట్ కేటాయింపులపై రాషట్ర ఆర్థికమంత్రి హరీష్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. కేంద్రం తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపిందని, అసలు ప్రాధాన్యత కలిగిన రంగాలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. దేశ రైతాంగాన్ని, 2వ పేజీలో...

# 3 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

## అధికారులతో సమీక్షించిన స్పీకర్ పోచారం



**హైదరాబాద్,ఫిబ్రవరి1(సమసమాజం):** ఈ నెల 3 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల హుందాతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు పారదర్శకంగా జరిగేందుకు ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలని కోరారు. బుధవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజన్‌కుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ సమావేశాల పనితీరు దేశంలోనే ఆదర్శంగా ఉందన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు వేగంగా సమాధానం ఇవ్వాలని సూచించారు.

# దేశంలో అత్యంత అవినీతి సిఎం కెసిఆర్

## బిజెపి కార్యకర్తల సమావేశంలో రాజగోపాల్ రెడ్డి



**ఆదిలాబాద్,ఫిబ్రవరి1(సమసమాజం):** దేశంలో అత్యంత అవినీతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని..మోడీ హయాంలోనే కల్వకుంట్ల కుటుంబ పాలనను అంతం చేయొచ్చని భావిస్తున్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొ 2వ పేజీలో...

# పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి

## 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జాతర ● ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట,ఫిబ్రవరి1(సమసమాజం):** దేశంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జాతర జరగనుందని పేర్కొన్నారు. మంత్రి జగదీష్ రెడ్డికి ప్రతీ యాదవ కుటుంబం రుణ పడి ఉంటుందన్నారు. మంత్రి జగదీష్ రెడ్డితో పాటు పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, కలెక్టర్ హేమంత్ పాటిల్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ పుట్టా కిషోర్, కౌన్సిలర్లు లక్ష్మీమకత్ లాల్, బాషా మియా, పెన్ పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీలు సంజీవ నాయక్, జీడి భిక్షం, అంజయ్య, చివ్వెంల వైస్ ఎంపీపీ జీవన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉప్పల ఆనంద్, కాచం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# సంపాదకీయం

## రాజకీయ అవినీతే అతిపెద్ద సవాల్ !

ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అవినీతే అతి పెద్ద శత్రువు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు వేదికగా చేసిన ప్రకటనపై ఇప్పుడు రాజకీయ నేతలు ఆలోచన చేయాలి. ప్రజలు కూడా అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలి. ఇది ఓ మహోద్యమంగా ముందుకు సాగాలి. దీని మూలాలను గమనించి పోరాటానికి సన్నద్ధం కావాలి. మర్రి ఊడల్లాగా పాతుకు పోయిన అవినీతిని కూకటివేళ్లతో పెకలించకపోతే దేశం పురోగతి సాధించలేదు. అవినీతి ఇప్పుడు రకరకాలుగా విస్తరించింది. రాజకీయ నేతల నుంచి ప్రజల వరకు అవినీతి జాడ్యం పట్టుకుంది. ఏదో ఒక రూపంలో అవినీతి లేకుండా ఎవరు కూడా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా రాజకీయ అవినీతిని ముందుగా పారద్రోలాలి. అవినీతిని రాజకీయ నేతలు సంస్థాగతం చేశారు. ప్రజలకు ప్రభుత్వ ధనాన్ని పంచడం ద్వారా ఓట్లు పొందేందుకు అవినీతికి తెరలేపారు. ప్రభుత్వ పథకాల్లో ఓట్లను రాబట్టే విస్తృతమైన స్వార్థాన్ని జోడించారు. ప్రజలు పన్నుల రూపంతో కట్టిన డబ్బుతో ఉదార పథకాలను రూపొందిస్తూ.. పందేరం చేస్తున్నారు. ఓ రకంగా రాజకీయ నాయకుల అవినీతికి ప్రజలు కూడా భాగస్వామ్యం అవుతున్నారు. సర్పంచ మొదలు ఎమ్మెల్యేలు, ఎంపిలుగా ఎన్నికైతే డబ్బు సంపాదించుకోవచ్చన్న వ్యాపార ధోరణి ఏర్పడింది. ఇప్పుడు అదే జరుగుతోంది. ఇకపోతే అనేకానేక కాంట్రాక్టులను చేపడుతున్న పాలకులు అందులో డబ్బులను గుంజే ప్రయత్నాలతో లబ్ది పొదుతున్నారు. ఇలాంటి అవినీతి కార్యక్రమాలు రాజకీయాల్లో ప్రాధాన్యం పొందాయి. ఇలా రాజకీయాల్లో ఏ పనిచేసినా దాని ధరలను పెంచి.. కంట్రాక్టర్ల నుంచి తిరిగి పొందుతున్నారు. ఈ డబ్బును ప్రజలకు పంచి ఓట్లు పొందుతున్నారు. ఇలా నైట్రోజన్ సర్కిల్‌లాగా అవినీతి చక్రంలా తిరుగుతోంది. రాజకీయ అవినీతిని అరికట్టనంత వరకు దేశంలో స్వచ్ఛమైన పాలన సాగదు. ఇక ఉద్యోగం పొందిన ఉద్యోగస్థులు తాము ప్రజలు కట్టిన పన్నుల డబ్బుతో జీతాలు పొందుతున్నామన్న స్పృహలో ఉండడం లేదు. ఏ పనికైనా లంచం లేనిదే పనిచేయడం లేదు. ఇది చట్ట వ్యతిరేకమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇలా అవినీతి కిందినుంచి పై వరకు వేళ్లూనుకు పోయింది. ఏ పనిచేసినా డబ్బులు చెల్లించనిదే పనులు కావడం లేదు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సెంట్రల్ హాలులో ఉభయసభల సభ్యుల నుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో అవినీతిపై ప్రధానంగా మాట్లాడారు. నిజంగా రాజకీయ అవినీతిపై మాట్లాడివుంటే బాగుండేది. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ద్రౌపది ముర్ము లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో ప్రసంగించడం ఇదే మొదటిసారి. దేశం ఆత్మ నిర్భర్ భారత్‌గా ఆవిర్భ విస్తోందని చెప్పిన ఆమె ఆ ప్రస్తానానికి అవినీతే ఆటంకంగా మారిందని అన్నారు. అవినీతిపై తన ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడి, పరారయ్యే నేరగాళ్ళ ఆస్తులను జప్తు చేసేందుకు ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అవినీతి రహిత దేశంగా మారే దిశగా భారత్ పయనిస్తోందన్నారు. నిజానికి అలా జరగడం లేదు. బ్యాంకులను ముంచిన దొంగలు విదేశాల్లో దర్జాగా తిరుగుతున్నారు. లంచాలు ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలను పొందిన వారెందరో ఇప్పుడు ఎగవేత జాబితాలో ఉన్నారు. అందులో రాజకీయ నేతలు అనేకులు ఉన్నారు. వారిలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు కూడా ఉన్నారు. ఇలాంటి వారి జాబితాను ప్రజల ముందు పెట్టాలి. వీరి ఎగవేతలను గుర్తించి ముక్కుపిండి వసూలు చేయాలి. 2047 నాటికి మన దేశాన్ని పూర్వ వైభవం, ఆధునిక కాలపు సువర్ణాధ్యాయాల అనుసంధానంతో నిర్మించాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు చూస్తున్న తీరు అద్భుతమని తెలిపారు. గతంలో మనం ప్రపంచంపై ఆధారపడేవారమని, ఇప్పుడు ప్రపంచమే మనపై ఆధారపడుతోందని చెప్పారు. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపగలుగుతున్నా మని చెప్పారు. పేదరికంలేని దేశాన్ని నిర్మించాలన్నారు. మధ్య తరగతి ప్రజలు కూడా సంపన్నులు కావాలన్నారు. సమాజానికి, దేశానికి దిశా నిర్దేశర చేయడానికి యువత, నారీశక్తి ముందు వరుసలో ఉండాలని తెలిపారు పన్ను చెల్లింపుదారులు తాము చెల్లించిన పన్ను రిఫండ్ కోసం గతంలో సుదీర్ఘ సమయం ఎదురు చూడవలసి వచ్చేదని తెలిపారు. నేడు ఐటీఆర్‌ను దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే రిఫండ్ పొందగలుగుతున్నారన్నారు. నిజానికి ఇవన్నీ బాగానే ఉన్నా అవినీతిపై పోరాటంలో మాత్రం ప్రభుత్వం అబద్దాలు చెబుతోంది. రాజకీయ అవినీతికి చెక్ పడితేనే ఉద్యోగ అవినీతి, తద్వారా ఇతర అవినీతిని తుద ముట్టించగలం. సంస్థాగతంగా మారిన అవినీతిని నిర్మూలించ గలిగితేనే దేశం పురోగమించగలదు. ఏ పని చేసినా లంచం లేనిదే పనులు జరగడం లేదు. అవినతికి అడ్డుకట్ట వేయపోతే మనం ఎన్ని లక్ష్యాలు విధించుకున్నా ముందుకు సాగలేం.అవినీతి లేని దేశం వైపు భారత్ అడుగులు వేయలేదు. దేశాభివృద్ధిలో రానున్న పాతికేళ్లు అత్యంత కీలకమని చెప్పుకుంటున్న ,,మోడీ ప్రభుత్వం 75ఏండ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు ఎంత ఘనంఆ జరుపుకున్నా..అవినీతి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోలేక పోతే లక్ష్యాలను సాధించలేం. నిజానికి ప్రజలు కడుతున్న పన్నులు సక్రమంగా వినియోగం కావాలి. దేశానికి అతిపెద్ద ముప్పుగా మారిన అవినీతిని అంతమొందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని పెంచాలి. బలమైన దేశాన్ని నిర్మించాలన్న సంకల్పాన్ని స్వాగతించాల్సిందే. అయితే ప్రభుత్వమే చెబుతున్న అవినీతి నిర్మూలనకు ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలి. అవినీతిని ముఖ్యంగా రాజకీయ అవినీతిని అరికట్టగలిగితే...పాలనలో పారదర్శకత తీసుకుని వస్తే పేద, మధ్యతరగతి, యువత, మహిళలు సహా అన్ని వర్గాల పౌరులు అభివృద్ధి చెందగలరు. సమాజంలో పేద, పెద్ద అన్న తరగతి తేడాలు తొలగి పోగలవు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న రాజకీయ అవినీతిని చెండాడడంలో ప్రజలు కూడా పోరాడాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# పేదలకు విద్యను చేరువ చేయడమే లక్ష్యం

మన ఊరు- మన బడి కార్యక్రమంలో స్కూళ్ల అభివృద్ధి
చింతకుంట పాఠశాలలో మౌళిక పనులను ప్రారంభించిన గంగుల



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (సమసమాజం):** చదువే అన్నిటికీ మూలం అని, విద్య ఉంటేనే సమాజంలో గౌరవించ బడతామని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు వసతులు లేక పేద విద్యార్థులు చాలా మంది చదువుకు దూరం అయ్యారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎవరు కూడా విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారని అన్నారు. కరీంనగర్ జిల్లా చింతకుంట మండల కేంద్రంలోనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా రూ. 27.24 లక్షలతో పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఇక జిల్లాలో మొదటి విడత మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా సూమారు 230 పాఠశాలలను రూ. 92 కోట్లతో ఆధునీకరణ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆధునీకరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి నిరుపేద విద్యార్థి కూడా ఉన్నత విద్య చదవాలని ఆలోచించిన వ్యక్తి కేసీఆర్ అని గంగుల పేర్కొన్నారు. దేశంలో కేజీ టూ పీజీ విద్య అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని.. విద్య, వైద్యం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిక్షణం పరితపిస్తున్నారని అన్నారు. ప్రైవేటు సీట్లు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో సీట్లు కావాలని నా వెంట పడుతున్నారనీ.. ఈ పరిస్థితి కేసీఆర్ కల్పించారనీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జేడ్పిటిసి పిట్టల కరుణ, నగర్ మేయర్ సునీల్ రావు, ఎంపీటీసీలు తిరుపతి నాయక్, ప్టటెం శారద ? లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభ్యున్నతే కెసిఆర్ లక్ష్యం

విద్య, వైద్యం,వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం
మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి



జనగామ,ఫిబ్రవరి 1 **(సమసమాజం)**: సబ్బండ వర్ణాల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామిణ అభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పల మండలం లక్ష్మణ్ తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ. 14.90 లక్షలతో ఏర్పాటు చేసిన అధునాతన వసతులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడుతున్నాయని, సర్కారు బడులలో సకల వసతులు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి మంచి నీళ్లు , వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల కరెంటుతో వ్యవసాయం పెరిగిందని అన్నారు. దీంతో భూముల ధరలు, రైతుల గౌరవం పెరిగిందని తెలిపారు. మరోవైపు నిరుద్యోగులకు కోసం ఇప్పటికే లక్షా 30 వేల ఉద్యోగాలు ఇచ్చి, మరో 70వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిందని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కూడా ప్రైవేట్ పరం చేస్తుందని ఆరోపించారు.వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమని కేంద్రం ఒత్తిడి చేస్తుంటే నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు మీటర్లు పెట్టమని సీఎం కేసీఆర్ తెగేసి చెప్పారని వెల్లడించారు. ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాలల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠాశాలల్లో వసతులు మెరుగవుతున్న దృష్ట్యా విద్యార్థుల సంఖ్య కూడా పెంచాలని సూచించారు. సీఎం కేసీఆర్ జనగామ జిల్లాల్లో రూ. 500 కోట్లతో పెద్ద హాస్పిటల్ , మెడికల్ కాలేజీ ఇస్తున్నారని ఆయన వెల్దించారు. అనంతరం పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివ లింగయ్య ,జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యా శాఖ అధికారి కె. రాము, మన ఊరు ? మన బడి ప్రత్యేక అధికారి వినోద్ కుమార్, ఎంపీపీ బసవ సావిత్రి , జడ్పీటీసీ పల్లా భార్గవి సుందర్ రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు భేష్

సిసి కెమెరాలతో మంచి ఫలితాలు
ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభంలో మహమ్మద్ అలీ

హైదరాబాద్,ఫిబ్రవరి 1 **(సమసమాజం)**: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ప్రభుత్వ సహకారంతో సీసీ టీవీల ఏర్పాటు, నిర్వహణలో తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన భవన సముదాయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తుండడం వల్ల రాష్ట్రంలో శాంత భద్రతలు అదుపులో ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం కేసీఆర్ నేతృత్వంలో పోలీస్ శాఖకు అధునాతన వాహనాలను సమకూర్చారని , టెక్నాలజీ వ్యవస్థను మరింత బలోపేతం చేశారని కొనియాడారు. సీసీ టీవీల ఏర్పాటుతో నేరాల దర్యాప్తు, నేరాల నియంత్రణ సులభతరమైందని వెల్లడించారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు నగరంలో ట్రాఫిక్ సమస్య లేకపోవడం వల్లే సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. డీజీపీ అంజని కుమార్ మాట్లాడుతూ పోలీసులు నిబద్ధత, సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ డి.ఎస్. చౌహాన్, జీహెచ్ఎంసీ మేయర్ విజయ లక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి పునాది వేసేలా బడ్జెట్ రూపకల్పన

(మొదటి పేజీ తరువాత) అందుకోసం రూ.13.7 లక్షల కోట్లు కేటాయించామని అన్నారు. నిర్మలా సీతారామన్ ప్రకటించిన శ్రీ అన్న పథకం అద్భుతమని మోడీ ప్రశంసించారు. ఉద్యానవన పంటలకు చేయూత అందించడంతో పాటు వ్యవసాయ స్టార్టప్ లకు ప్రత్యేక నిధి కేటాయించిన విషయాన్ని మోడీ గుర్తు చేశారు. ఫార్మారంగం అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందన్న ఆయన.. ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు పాన్ కార్డును చేస్తామని అంగీకరించనున్నట్లు మోడీ స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. రైతులు ,గ్రామిణ ప్రాంతాలకు ఎక్కువ నిధులు కేటాయించి నట్టు చెప్పారు. చారిత్రక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన్నందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు అని అన్నారు. విశ్వకర్మలకు తొలిసారి బడ్జెట్‌లో స్థానం దక్కిందని.. బ్జడెట్‌లో అనేక ప్రోత్సహకాలు ప్రకటించామని మోడీ పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం అనంతరం ప్రధాని మోడీ మాట్లాడారు. అమృత్ కాల్ లో ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ భారతదేశ అభివృద్ధి కోసం బలమైన పునాదిని నిర్మిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజలు, రైతులతో సహా అందరి ఆకాంక్షలను, కలలను నెరవేరుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్ భారత అభివృద్ధితోపాటు గొప్ప సంకల్పాన్ని నెరవేరుస్తుందన్నారు. దేశం కోసం కష్టపడి పనిచేసిన 'విశ్వకర్మ' ఈ దేశ సృష్టికర్త అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. తొలిసారిగా 'విశ్వకర్మ' శిక్షణ, సహాయానికి సంబంధించిన పథకాన్ని బ్జడెట్‌లో తీసుకొచ్చినట్లు వివరించారు. విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ ద్వారా సంప్రదాయ వృత్తుల వారికి చేయూతను అందించనున్నట్లు వివరించారు. ఈ బడ్జెట్ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ గ్రోత్, గ్రీన్ ఇన్‌ఫ్రాస్టక్చర్, గ్రీన్ జాబ్‌లను మరింత ప్రోత్సహించేలా స్థిరమైన భవిష్యత్తు కోసం రూపొందించినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. సాంకేతికత, కొత్త ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించామమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గ్రామిణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళల జీవితాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది.. మహిళా స్వయం సహాయక సంఘాలు వారి జీవితాన్ని మరింత మెరుగుపరుస్తాయి. ఇళ్లలో మహిళలకు సాధికారత కల్పించేందుకు ప్రత్యేక పొదుపు పథకం ప్రారంభించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

## దేశంలో అత్యంత అవినీతి సిఎం కెసిఆర్

(మొదటి పేజీ తరువాత)చ్చినా బీజేపీ సిద్ధం గా ఉందని స్పష్టంచేశారు. 9 ఏళ్ల క్రితం కల్వకుంట్ల కుటుంబ ఆస్తి ఎంత.. ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. మునుగోడులో అడ్డదారిలో గెలిచిన కేసీఆర్ పై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేసీఆర్.. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్నారని అన్నారు. రాష్ట్రంలో నిజమైన కురక్షేత్రం ముందుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. వెయ్యి మందికిపైగా ఆత్మబలిదానాలు చేసుకుంటే ఏర్పడిన తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ పాలన కొనసాగడం బాధాకరమన్నారు. రైతు బంధు, దళిత బంధు, డబుల్ బెడ్రూం తదితర పథకాలన్నీ ఎన్నికల జిమ్మిక్కులేనని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తానని మాట తప్పిన కేసీఆర్.. కనీసం ప్రభుత్వ స్కూళ్లలో కనీస సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. అధికారం, డబ్బుతో ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా ఉంటే.. బీజేపీ వైపు ధర్మం, ప్రజాబలం ఉన్నాయన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజీ తరువాత)అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను నిరుత్సాహ పరిచే విధంగా ఉందని హరీష్ అభిప్రాయపడ్డారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణ అడుగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గురించి ఈసారి కూడా ప్రస్తావించకపోవడంపై ఆయన మండిపడ్డారు. విభజన హామీల్లో ఓ ఒక్కదాన్ని కేంద్రం అమలు చేయలేదని హరీష్ విమర్శించారు. రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని నేతన్నలకు జీఎస్టీ రాయితీలు, ప్రత్యేక ప్రోత్సాహాలు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించడంతో పాటు గ్రామిణ ఉపాధి హామీ నిధుల్లో కోత పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, సింగరేణి కార్మికులకు ఇచ్చిన పన్ను మినహాయింపులు కూడా ఏమీ ఆశాజనకంగా ఏమీ లేదన్న హరీష్ ఇది కేవలం భ్రమల బ్జడెట్ అని అన్నారు.

**సామాన్యుల గొంతుకై.. గలమెత్తిన మహిళా నేత, ప్రభుత్వంలో జరిగే లోటుపాటులను నిర్మోహమాటంగా నిగ్గదీసి ప్రశ్నిస్తున్న ధీర వనిత. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోవాలని, భావి తరాలకు భరోసానివ్వాలని, పేద ప్రజలకు తన వంతు చేయూత, సహకారం అందించాలని భావించి రాజకీయాలలోకి అడుగుపెట్టిన బహుజన బిడ్డకు అడుగడుగున ఆటంకాలే ఎదురౌతున్నాయి. ప్రజలకు మేలు చేయాలనే తన సంకల్పం ముందు భూజ్వపు పొలిటికల్ పార్టీలు... తమ స్వార్థపూరిత రాజకీయాలకు ఇందిరాశోభన్ బలైపోతూనే ఉంది. కాదు.... కాదు... నికార్సైన మహిళా నేతను దూరం చేసుకొని పార్టీలే మైలేజీని కోల్పోతున్నాయి.**

### నీ దారెటూ ?

తెగువ, ధైర్యం, పోరాటం ఆమె సొంతం. మధ్యతరగతి కుటుం బంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి, ఒక బహుజన బిడ్డగా ప్రజలకు సేవ చేయాలనే ఒకే ఒక సంకల్పంతో ప్రజా క్షేత్రం లోకి అడుగుపెట్టింది. ఏ పార్టీలో పని చేసినా తన మార్క్‌ను ఏర్పాటు చేసుకుంది. తన వాక్‌చాతుర్యం, రాజకీయ చతుర త కలిగిన ఇందిరా శోభన్ ఎందుకు ఆయా పార్టీలలో మిలితం కావడం లేదు అనే ప్రశ్నకు తానే జవాబు చెప్పాలి. పార్టీలు మారటం ఆమెకు అలవాటే.. అని కొందరు ముక్కు విరుపు విమర్శలు చేస్తున్నారు. అలాంటి వారికి ఏ రూపంలో సమాధానం చెబుతుందో వేచి చూడాలి. ఇంతకు ఇందిరా 'కొత్త పార్టీ' ని పెట్టే అవకాశాలు ఉన్నాయా? లేక మరేదైనా పార్టీ కండువ కప్పుకుంటారా వేచి చూడాలి మరి.



# ఇందిరాశోభన్‌కు పార్టీలు నేర్పిన గుణపాఠం

## కొత్త పార్టీ పెడుతుందా? మరో పార్టీకి మారుతుందా ?

*సమ సమాజం, ప్రత్యేక కథనం*

**హైదరాబాద్, జనవరి 31:** తెలంగాణలో సీనియర్ రాజకీయ నాయకురాలు ఇందిరా శోభన్ ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం కొనసాగిన ఆమె కాంగ్రెస్ పార్టీ ద్వారా తగిన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తరువాత పార్టీని వీడి వైఎస్ షర్మిల వెంట నడిచారు. షర్మిల స్థాపించిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో కీలక పాత్ర పోషించారు. పార్టీలో షర్మిల తర్వాత ప్రాధాన్యత కలిగిన నాయకురాలిగా గుర్తింపు పొందారు. అయితే తెలంగాణలో ఆప్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు అహర్నిషలు పార్టీ కోసం శ్రమించారు. ఇటీవల ఖమ్మం సభకు ఆప్ పార్టీ అధినేత కేజ్రీవాల్ రావడంతో ఖంగుతిన్న ఇందిరాశోభన్ మనస్థాపానికి గురై ఆప్ పార్టీకి రాజీనామా చేసినట్లుగా తెలుస్తుంది. దీంతో ఆమె తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తారన్న ప్రచారం జరుగుతున్నా ఇందిరా శోభన్ మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఎటూపోయి పలు పార్టీలకు రాజీనామాలు చేసి ఇతరా పార్టీలోకి చేరడం, కొంత కాలానికి విభేదించి మరో పార్టీ కండువ కప్పుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటివరకు ఇందిరాశోభన్‌కు పార్టీలు నేర్పిన గుణపాఠం కారణంగా కొత్తపార్టీ పెడుతుందా ? లేక మరో పార్టీలో చేరుతుందా ? అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# భారత్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద విజయం

## గిల్ అజేయ శతకం





**సత్తా చాటిన హార్దిక్**

**అహ్మదాబాద్ టీ20లో భారత్ ఘన విజయం**

**గిల్ శతకంతో 20 ఓవర్లలో 234 పరుగులు చేసిన టీమిండియా**

**హార్దిక్ 4 వికెట్లతో చెలరేగడంతో కివీస్ 66 రన్స్‌కే ఆలౌట్**

అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 166 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్ అజేయ శతకం బాదడంతో టీమిండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్య కెరీర్లో బెస్ట్ బౌలింగ్ గణాంకాలు నమోదు చేయడంతోపాటు.. పేసర్లు విజృంభించడంతో కివీస్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే ఆలౌటయ్యింది. దీంతో పరుగుల అంతరం పరంగా భారీ విజయాన్ని నమోదు చేసిన భారత్.. 2-1 తేడాతో టీ20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ సొంత గడ్డ మీద రెండు టీ20, 2 వన్డే సిరీస్‌లు ఆడిన భారత్.. నాలుగింటినీ సొంతం చేసుకోవడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఆరంభంలోనే ఇషాన్ కిషన్ (1) వికెట్‌ను కోల్పోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రాహుల్ త్రిపాఠి ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. 4 ఫోర్లు, 3 సిక్సులు బాదిన త్రిపాఠి 22 బంతుల్లో 44 పరుగులు చేశాడు. త్రిపాఠి ఔటయ్యాక సూర్య (13 బంతుల్లో 24), హార్దిక్ పాండ్య (17 బంతుల్లో 30) వేగంగా ఆడారు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ 12 ఫోర్లు, 7 సిక్సులతో 63 బంతుల్లో 126 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. టీ20ల్లో భారత్ తరఫున ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం. 35 బంతుల్లో 50 రన్స్ చేసిన గిల్ ఆ తర్వాత జోరు పెంచాడు. ఫెర్గ్యుసన్ బౌలింగ్‌లో బౌండరీ బాది 54 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీ20ల్లో తొలి హాఫ్ సెంచరీనే గిల్ శతకంగా మలవడం విశేషం. అంతర్జాతీయ టీ20ల్లో శతకం బాదిన పిన్న వయస్కుడైన భారత క్రికెటర్‌గా గిల్ రికార్డ్ క్రియేట్ చేశాడు. ఈ ఏడాది గిల్‌కు ఇది మూడో సెంచరీ కావడం గమనార్హం. శుభ్‌మన్ అజేయ శతకంతో భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్.. హార్దిక్ పాండ్య, అర్షదీప్ సింగ్ చెలరేగడంతో 2.4 ఓవర్లలోనే 7 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. బ్రాస్‌వెల్‌ను ఉమ్రాన్ మాలిక్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ 21 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయింది. వరుసగా వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో డారెల్ మిచెల్ క్రీజ్‌లో పాతుకుపోయాడు. కెప్టెన్ శాంట్నర్ (13)తో కలిసి ఆరో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. మావి బౌలింగ్‌లో సిక్స్ కొట్టేందుకు యత్నించి శాంట్నర్.. సూర్య బౌండరీ లైన్ వద్ద అద్భుతంగా క్యాచ్ పట్టడంతో వెనుదిరిగాడు. అదే ఓవర్లో ఇష్ సోధీ (0)ని మావి ఔట్ చేశాడు. హార్దిక్ పాండ్య వరుస ఓవర్లలో ఫెర్గ్యుసన్, టిక్నర్‌లను పెవిలియన్ చేర్చగా.. మిచెల్ (25 బంతుల్లో 35)ను ఔట్ చేసిన ఉమ్రాన్ మాలిక్ లాంఛనాన్ని ముగించాడు. దీంతో న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే ఆలౌటయ్యింది.








## నేను మనిషిగానే ఉంటా: మైఖేల్

సందీప్ కిషన్ హీరోగా రంజిత్ జయకోడి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మైఖేల్'. ఈ చిత్రం ఫిబ్రవరి 3న సౌత్ ఇండియన్ లాంగ్వేజ్‌లతో పాటు హిందీలోనూ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్ లో నిర్వహించారు. తాజాగా ఈ మూవీ మేకింగ్ వీడియోను మేకర్స్ వదిలారు. ఇందులో యాక్షన్ సీన్స్ ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. సందీప్ కిషన్ పోరాట సన్నివేశాల్లో అదరగొట్టాడు. ఇక విజయ్ సేతుపతి, వరలక్ష్మి శరత్ కుమార్, గౌతమ్ మీనన్ ఆకట్టుకున్నారు. 'మన్నించేటప్పుడు దేవుడు అవుతాం మైఖేల్' అని అంటే 'నేను మనిషిగానే ఉంటాను మాస్టార్.. దేవుడవ్వాలనే ఆశ లేదు' అని సందీప్ చెప్పడం మూవీపై మరింత ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాలో సందీప్ కిషన్ సిక్స్ ప్యాక్ బాడీ కోసం బాగా కష్టపడ్డాడని తెలుస్తోంది. దివ్యాంశ కౌశిక్ హీరోయిన్ గా నటించిన ఈ మూవీని నారాయణ్ దాస్ కె నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్ మోహన్ రావు కలిసి నిర్మించారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి, వరలక్ష్మి శరత్ కుమార్, గౌతమ్ మీనన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు.



## రెండు భాగాలుగా హరిహరవీరమల్లు

### ఫిలింనగర్‌లో టాక్ చక్కర్లు

పవన్ కళ్యాణ్ కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం హరిహర వీరమల్లు. క్రిష్- పవన్ కళ్యాణ్ కాంబినేషన్ లో వస్తున్న తొలి చిత్రం ఇది. అలాగే పవన్ కళ్యాణ్ ని ఇప్పటి వరకు పీరియాడిక్ సినిమాల్లో చూసింది లేదు. హరిహర వీరమల్లుతో ఆ కోరిక తీరనుంది. హరిహర వీరమల్లు మూవీ మొగలాయిల కాలం నేపథ్యంలో తెరకెక్కుతోంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన పండుగలు సాయన్న అనే ఒక బందిపోటు జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. రెండు డిఫరెంట్ టైమ్ పీరియడ్స్ లో ఈ కథ సాగుతుందని టాక్. అయితే ఈ సినిమా అప్పట్లో ఎప్పుడో ప్రారంభమైనా ఇప్పటికీ నత్తనడకనే సాగుతోంది. టీజర్ వచ్చేస్తుందని సినిమా ఆల్ మోస్ట్ కంప్లీట్ అయిందన్న వార్తలు తప్ప మూవీ టీం నుండి ఎలాంటి అప్ డేట్లు రావడం లేదు. కరోనాతో షూటింగ్ ఆగిపోవడం పవన్ రాజకీయాల్లో బిజీ అయిపోవడం భారీ బడ్జెట్ సినిమా కావడంతో షూటింగ్ నిలిచిపోవడం ఇలా కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్లుగా ఏదో ఒక కారణంతో ఈ సినిమా వాయిదా పడుతూ వస్తోంది. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ అభిమానులను ఉర్రూతలూగించేలా హరిహర వీరమల్లు నుండి ఒక అప్ డేట్ వచ్చింది. హరిహర వీరమల్లు మూవీని రెండు భాగాలుగా తెరకెక్కించనున్నారని ఫిల్మ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇదే కనుక జరిగితే పీకే ఫ్యాన్స్ కు అదిరిపోయే ఆఫర్ వచ్చేసినట్లే. ఈ వార్తలో ఎంత నిజముందో తెలియాలంటే మాత్రం చిత్ర బృందం నుండి అఫీషియల్ గా ప్రకటన రావాల్సి ఉంది. హరిహర వీరమల్లు నుండి ఇప్పటికే క్రిష్ టీం విడుదల చేసిన కొన్ని వీడియోల వల్ల సినిమా మీద ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు పెరిగాయి. ఎంఎం కీరవాణి ఇచ్చిన అద్భుతమైన బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా అంచనాలను పెంచింది. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. పంచమి అనే పాత్రలో నిధి కనిపించబోతుంది. ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్ లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**, RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in